కోహీర్ పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

వట్‌పల్లి : వట్‌పల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

కల్హేర్ : జూనియర్ కళాశాలలో పోలింగ్ వివరాలను తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ సంజీవరావు

గుమ్మడిదలలో ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రం వద్ద ఆర్డీవో రవీందర్‌రెడ్డి, సిబ్బంది

అమీన్‌పూర్ : జీరంగూడలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలో ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం నుంచి ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులు బారులుతీరారు. ఎన్నికల అధికారులు కట్టుబిట్టమైన చర్యలు తీసుకొని ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూశారు. గుమ్మడిదల మండలంలో చెత్త డంపింగ్‌యార్డు వద్దంటూ జరుగుతున్న ఉద్యమంలో పాల్గొంటున్న జేఏసీ సభ్యులు ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించేందుకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో 295 ఓట్లకు గాను 42 మాత్రమే పోలయ్యాయి. జిల్లాలోని ఆయా కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను అధికారులు తనిఖీ చేశారు.

- సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 27

పటాన్‌చెరులో ఓటు హక్కును వినియోగించుకున్న ఓ మహిళ

మునిపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆశజ్యోతి

ఆర్సీపురంలో ఓటు హక్కుని వినియోగించుకున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి కుటుంబం

జిన్నారం ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భిక్షపతి, ఎస్సై నాగలక్ష్మి

నిజాంపేట్ : ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ సంజీవ్‌రావు

రాయికోడ్ : ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకుటున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విఠల్, నేతలు

నారాయణఖేడ్: పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

జహీరాబాద్ : న్యాల్‌కల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రాంరెడ్డి, అధికారులు

ఝరాసంగం : వీలుచైర్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న దివ్యాంగురాలు

పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

చౌటకూర్, ఫిబ్రవరి 27 : మండల కేంద్రం చౌటకూర్‌లోని పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం సందర్శించారు. వేర్వేరుగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి పోలింగ్ సరళి, బ్యాలెట్ పత్రాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిని చైతన్యవంతం చేశామని, తద్వారా ఆశించిన మేరకు పోలింగ్ నమోదయ్యిందన్నారు. చౌటకూర్‌లో పట్టభద్రులు 273 మందికి 219 మంది, ఉపాధ్యాయులు 18 మందికి 15 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, ఆర్డీవో పాండు, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, పుల్కల్ ఎస్సై క్రాంతికుమార్ పాటిల్ పరిశీలించారు.

చౌటకూర్ పోలింగ్ కేంద్రంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు

ఖ్వాజా ఉర్సులో గంధం సమర్పించిన మాజీ ఎమ్మెల్యే

వట్‌పల్లి : వట్‌పల్లి సద్గురు వెంకట్ ఖ్వాజా దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

వట్‌పల్లి, ఫిబ్రవరి 27 : సర్వమత సన్నిధి.. సద్గురు వెంకట్ ఖ్వాజా ఉర్సు రెండో దీపారాధనతో దర్గా ప్రాంగణం దీపాల కాంతులతో వెదజిల్లింది. ఉత్సవానికి హాజరైన అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు కమిటీ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం దర్గాకు గంధం సమర్పించారు. రాష్ట్రానికి చెందిన భక్తులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు దర్గాను దర్శించుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, ఫిబ్రవరి 27 : సిర్గాపూర్ మండలం చీమల్‌పాడ్ గ్రామానికి చెందిన బావుగే నీలమ్మకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి గురువారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహారెడ్డి శ్రేయారెడ్డి, నాయకులు రవీందర్‌నాయక్, నగేష్, అంజాగౌడ్, మల్‌గొండ, మశ్చందర్, బస్వరాజ్, చింటూ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఈపీఎఫ్‌వోపై అవగాహన పెంచుకోవాలి

కంది, ఫిబ్రవరి 27 : ఉద్యోగుల ప్రయోజనాల కోసం భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సంస్థ రీజనల్ అధికారి విశాల్ అగర్వాల్ సూచించారు. కంది మండలం ఇంద్రకరణ్ శివారులోని అరబిందో రీసెర్చ్ సెంటర్-2లో గురువారం ఈపీఎఫ్‌వో ద్వారా అందిస్తున్న సదుపాయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అరోబిందో యూనిట్లలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పింఛన్ ఆర్డర్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 27న జిల్లాలోని పరిశ్రమలు, సంస్థల్లో ఈపీఎఫ్‌వోపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈఎఫ్‌వో అధికారి శ్రీదేవి, హెచ్ఆర్ మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఫించన్ పత్రాలను అందజేసిన ఈపీఎఫ్‌వో రీజనల్ అధికారి విశాల్ అగర్వాల్

సంగమేశ్వరాలయం వద్ద కుస్తీ పోటీలు

నిజాంపేట్, ఫిబ్రవరి 27 : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిజాంపేట్ మండల పరిధిలోని బాచేపల్లిలో ఉమాసంగమేశ్వర ఆలయం వద్ద గురువారం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కుస్తీ పోటీల్లో తల పడేందుకు వివిధ గ్రామాల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి యువకులు వచ్చి కుస్తీపోటీల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

వైభవంగా కల్యాణం

మహాశివరాత్రిని పురస్కరించుకొని బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరలో భాగంగా గురువారం రెండో రోజు స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

-అమీన్‌పూర్, ఫిబ్రవరి 27

కేతకీలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఝరాసంగం, ఫిబ్రవరి 27 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి నవాహ్నిక జాతర బ్రహ్మోత్సవాలను వైభవంగా జరుగుతున్నాయి. గురువారం పార్వతీ సమేత సంగమేశ్వర స్వామివారలను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని కేతకీ ఆలయానికి కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగి జిల్లా ఎస్పీ అడ్డూరి శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప సన్మానించి స్వామివారి తీర్థప్రసాదం అందజేశారు. ఆయన వెంట స్థానిక ఎస్సై నరేశ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లఫోరం అధ్యక్షులు రుద్రప్పపాటిల్, శేఖర్‌పటేల్, మల్లయ్య స్వామి, భక్తులు పాల్గొన్నారు.

నందివాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

పింఛన్ల కోసం వృద్ధుల నిరీక్షణ

గుమ్మడిదల మున్సిపాలిటీలోని పోస్ట్ ఆఫీస్ వద్ద పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 27 : ప్రతి నెలా ఇచ్చే పింఛన్ల కోసం వృద్ధులు పడికాపులు కాశారు. సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి పోస్టు ఆఫీస్ వద్దే నిరీక్షించారు. గురువారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద పింఛన్‌దారులు గంటల తరబడి వేచి ఉన్నారు. ఫిబ్రవరి నెల మొదటి వారంలో రావాల్సిన పింఛన్ చివరివారంలో ఇవ్వడంతో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు పోస్టాఫీస్ వద్ద తిప్పలు పడ్డారు. సర్వర్ మొరాయించడంతో వద్ధులు మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోస్టాఫీస్ వద్ద నిరీక్షించారు. ప్రతి నెలా ఏదో ఒక కారణంగా పిం ఛన్ ఆలస్యమవుతున్నదని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి మొదటివారంలో ఇచ్చే పింఛన్లు చివరి వారంలో ఇవ్వడంపై వృద్ధులు అసహనం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 27 : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేతనాలను వెంటనే అందించాలని జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వం వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అంజమ్మ వేతనాల గురించి ఐసీడీఎస్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సీఐటీయూ నాయకురాలు విజయలక్ష్మి, నాగమణి, గౌరమ్మ, బాలమణి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాయం ఎదుట ధర్నా చేస్తున్న ఆంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

మహిళ దారుణ హత్య

సదాశివపేట, ఫిబ్రవరి 27 : గుర్తు తెలియని దుండగలు ఓ మహిళను హత్య చేసిన ఘటన పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన గల ప్రహరీ వద్ద గురువారం చోటు చేసుకుంది. సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందికంది గ్రామానికి చెందిన సారలక్ష్మి (39) భర్త అంజయ్య వృత్తి రీత్యా కూలీ. నాలుగైదు రోజుల కింద అనంతసాగర్‌లో ఉండే కూతురు శిరీష వద్దకు వెళ్లింది. ఈ నెల 26న కూతురు శిరీషతో కలిసి కూరగాయలు కొనడానికి సదాశివపేటకు వచ్చింది. కూరగాయలు తీసుకుని కూతురు శిరీషను ఆటోలో అనంతసాగర్‌కు పంపించి లక్ష్మి తన స్వగ్రామం నందికందికి వెళ్లింది. అదే రోజు రాత్రి పదిన్నర గంటల సమయంలో ఏదో పని ఉన్నదని భర్త అంజయ్యకు చెప్పి మళ్లీ సదాశివపేటకు వచ్చింది. 27న ఎంపీడీవో కార్యాలయం పక్కన గల ప్రహరీ వద్ద లక్ష్మీ తలకు తీవ్ర గాయాలతో మృతిచెంది ఉంది. గురువారం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి నందికంది గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతురాలు తమ్ముడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. డాగ్ స్క్వాడ్, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మహిళ హత్యకు గల వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కంది, ఫిబ్రవరి 27 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం కంది జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తునికీలతండాకు చెందిన రమావత్ రాజు (45) పని నిమిత్తం బైక్‌పై కందికి వచ్చాడు. తిరిగి తండాకు వెళ్లేక్రమంలో జాతీయ రహదారిపై యూటర్న్ చేస్తుండగా వెనుక నుంచి అతివేగంతో వచ్చిన లారీ, బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కింద పడిపోయిన రాజు తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపు జాబ్ మేళా

రామచంద్రాపురం, ఫిబ్రవరి 27 : బీహెచ్ఈఎల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ సహకారంతో మెగా జాబ్‌మేళాను మార్చి ఒకటిన నిర్వహించనున్నట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పదికిపైగా ప్రముఖ ఫార్మా, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఇతర కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఎస్ఎస్సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఏదైనా పీజీ, ఎంఫార్మసీ, ఏఎన్ఎం వంటి విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏండ్ల వయస్సు ఉన్న యువతీ, యువకులు ఎవరైనా జాబ్‌మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. వివరాల కోసం 915 4084725,9963868668 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు పంట రకాలు, రైతుల పరిరక్షణపై

అవగాహన సదస్సు

జహీరాబాద్, ఫిబ్రవరి 27 : జహీరాబాద్ మండలంలోని దిడ్గి గ్రామ శివారులోని డీడీఎస్-కేవీకే కేంద్రంలో నేడు (శుక్రవారం) పంట రకాలు, రైతుల పరిరక్షణపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పీపీవీఎస్ ఆర్ఏ సహకారంతో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, అటారి జోన్-10, డీడీఎస్-కేవీ కే అధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సుకు పీపీవీఎస్ ఆర్ఏ చైర్మన్ డాక్టర్ త్రిలోచన మహాపాత్ర, రిజిస్ట్రర్ జనరల్ డాక్టర్ దినేశ్ అగర్వాల్, అటారీ జోన్-10 డైరెక్టర్ షేక్ ఎన్ మీరాతో రాష్ట్రంలోని 16 కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో వివిధ ప్రాంతాల్లో రైతులు సంరక్షించుకుంటున్న విత్తనాల రకాలను వారి పేరు మీద నమోదు చేసుకోవాలని సూచించారు. సదస్సుకు జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని డీడీఎస్-కేవీకే కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ సూచించారు.

కాలుష్య జలాలు తాగి బర్రె మృతి

జిన్నారం ఫిబ్రవరి 27 : మండలంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అయ్యమ్మ చెరువు సమీపంలో బర్రె కాలుష్య జలాలు తాగి మృతి చెందిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ రైతు సుధాకర్‌కు చెందిన ఓ బర్రె కాలుష్యమయంగా మారిన చెరువులోని నీటిని తాగి మృత్యువాత పడడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. తరచూ మూగ జీవాలు కాలుష్య జలాలకు బలవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పీసీబీ అధికారులకు ఫిర్యాదు..

శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

బర్రె మృతితో పీసీబీ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పీసీబీ ఎన్విరాల్‌మెంట్ సైంటిస్ట్ రవీందర్ పారిశ్రామిక వాడలోని చెరువును, కాల్వల ద్వారా పలు పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయన వ్యర్థ జనాలను తనిఖీ చేశారు. అనంతరం కాలుష్య జలాల శాంపిల్స్ సేకరించారు. ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

సదాశివపేట, ఫిబ్రవరి 27 : ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన 65వ జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గాజులరామారానికి చెందిన దొడ్డి సామెల్ భార్య వేదమని (49) బైక్‌పై జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. సదాశివపేట బైపాస్ రోడ్డులోని 65 జాతీయ రహదారి వెంకటాపూర్ బ్రిడ్జి రాగానే చీర బైక్ వెనక టైరులో చిక్కుకున్నది. దీంతో వేదమని ఒక్కసారిగా రోడ్డుపై పడడంతో తలకు బలంగా గాయాలై అక్కడిక్కడే మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి భర్త సామెల్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

చౌటకూర్‌లో..

చౌటకూర్, ఫిబ్రవరి 27: ప్రమాదవశాతు బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలైన మహిళ చికిత్స పొందుతూ విషమించి మృతి చెందింది. పుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొమ్మరాజు శోభ (41) 24న కిరాణ సామగ్రి కొనుగోలు చేసేందుకు జోగిపేటకు వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో చౌటకూర్‌కు వచ్చి బొమ్మారెడ్డిగూడెం గ్రామానికి వెళ్లేందుకు సమీప బంధవుకు చెందిన మోటరు బైక్‌పై ప్రయాణించారు. ఈ క్రమంలో చౌటకూర్ గ్రామ శివారులోని ఇటుక బట్టి వద్ద అదుపుతప్పి బైక్‌పై నుంచి కింద పడింది. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ మేరకు పుల్కల్ ఎస్సై క్రాంతికుమార్ పాటిల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను గురువారం గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ పరామర్శించారు.